

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 30-10-2022 సంపుటి : 04 సంచిక : 63 పేజీలు : 4 వెల : రూ 3-00

## అసెంబ్లీ ఎన్నికల ముందు..

### గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం



అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యునిఫామ్ సివిల్ కోడ్ – యూసీసీ)ని అమలు చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు శనివారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ''కేబినెట్ సమావేశంలో ముఖ్య నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని పరిశీలించేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు/హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కమిటీ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని యూసీసీపై ముసాయిదాను సిద్ధం చేస్తుంది" అని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ట్విటర్‌లో వెల్లడించారు. గతంలో ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని అక్కడి భాజపా ప్రభుత్వాలు ప్రకటించాయి. ఈ ఏడాది ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో భాజపా ఈ హామీని ప్రకటించింది. అన్నట్లుగానే పుష్కర్ సింగ్ ధామి సీఎంగా బాధ్యతలు చేపట్టిన మరునటి రోజే యూసీసీని అమలు చేసేందుకు నిపుణులతో కూడిన హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇప్పుడు గుజరాత్‌లో మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ రాష్ట్రంలోనూ ఉమ్మడి పౌరస్మృతిపై భాజపా కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. గోవాలో ఇప్పటికే ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది. పోర్చుగీస్ సివిల్ కోడ్, 1867ను గోవా అనుసరిస్తోంది. ఇక ఒకసారి ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి వస్తే.. వివాహం, వారసత్వం, ఆస్తి హక్కులకు సంబంధించి ఒకే చట్టం అమల్లో ఉంటుంది. అంటే హిందూ వివాహ చట్టం, 1955, హిందూ వారసత్వ చట్టం 1956 లేదా భారత వారసత్వ చట్టం 1925, షరియత్ చట్టం, 1937 వంటివి ఇక చెల్లుబాటులో ఉండవు. అయితే ఈ ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొచ్చే అంశంపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొందరు నిపుణులు దీన్ని సమర్థిస్తుండగా.. మరికొందరు వ్యతిరేకిస్తున్నారు.

## ఉచిత తాయిలాలపై చర్చ జరగాలి

### నిర్మలా సీతారామన్



విశాఖపట్నం ప్రజలకు ఉచితంగా తాయిలాలు అందించడంపై విస్తృతంగా చర్చ జరగాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. అవన్నీ అసెంబ్లీలో సభ్యులకు తెలిసే జరుగుతున్నాయా, ప్రజలకు కూడా ఆ వివరాలు చెబుతున్నారా లేదా అనే అంశాలు చర్చకు పెట్టాలన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీలు కట్టడానికి అప్పులు చేస్తున్నాయని, ఇది మంచి విధానం కాదన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు శతజయంతి ఉత్సవాలను విశాఖ గీతం యూనివర్సిటీలో ఆయన కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమం... సుపరిపాలన అంశంపై ప్రధాన వక్తలు స్మారక ఉపన్యాసం చేశారు. ముఖ్య అతిథి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలన్నీ అర్హులకు అందించడమే సుపరిపాలనగా విశ్లేషించారు. సాంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద ప్రతి ఎంపీ రెండు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించగా, ఎటువంటి అదనపు నిధులు కేటాయించకుండానే అమలులో ఉన్న పథకాలనే అందజేసి అభివృద్ధి చూపించగలిగామన్నారు. ఎన్‌టీఆర్ గొప్ప మానవతావాది, ఆర్ద్రత కలిగిన నాయకుడని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ కొనియాడారు. పేదలు వారి కాళ్లపై వారు నిలబడేలా, ప్రభుత్వం సాయపడాలని చెప్పేవారన్నా రు. అంతే తప్ప ఆ రోజుకు పూట గడవడం ము ఖ్యం కాదని ఎన్‌టీఆర్ అనేవారని, అదే సుపరిపాలన లక్షణమన్నారు. స్థానిక ప్రజలు తమ సమస్యలపై నిర్ణయం తీసుకునేలా క్రాంతిపథం పథకాన్ని ఆయన ప్రవేశపెడితే ఆ పథకం ద్వారా ప్రకాశం జిల్లాలో కలెక్టర్‌గా తాను లక్ష ఎకరాలకు సాగునీరు అందించగలిగానని, అక్కడి వారంతా పేదరికం నుంచి బయటపడ్డారన్నా రు. అధికారం ప్రజల చేతుల్లో ఉండాలనేది ఎన్‌టీఆర్ ఆశయమని, అదే నాయకుడి లక్షణమన్నారు. ఇప్పటి ప్రభుత్వాలు ప్రజలకు సాధికారత కల్పించకుండా తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నాయని, అది మంచి పద్ధతి కాదన్నారు.

## మహబూబ్‌నగర్‌లో జోడో యాత్ర..



పాలమూరు: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర శనివారం ఉదయం 6 గంటలకు మహబూబ్ నగర్ మండల పరిధిలోని ధర్మాపూర్‌లో ఉన్న జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ప్రారంభమైంది. ఈ యాత్రలో మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్, ఏఐసీసీ సభ్యుడు జైరాం రమేష్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు భట్టి విక్రమార్క, మధుయాష్కీగౌడ్, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సీతక్క, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం సమయంలో 15 కిలోమీటర్ల మేర యాత్ర సాగింది. దారిపొడవునా యువకులు, చిన్నారులు, మహిళలు, కళాకారులు, వివిధ సంఘాల నేతలు, కార్మికులతో రాహుల్ ముచ్చటించారు. సినీనటి పూనమ్‌కౌర్ రాహుల్‌తో పాదయాత్రలో పాల్గొన్నారు. భద్రాచలం నుంచి వచ్చిన గిరిజనులు రాహుల్‌తో కలిసి యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ వారితో కలిసి సంప్రదాయ నృత్యం చేసి ఆకట్టుకున్నారు. చేనేత కార్మికులు వారి సమస్యలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం విధించిన జీఎస్టీని తొలగించి.. పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో 3వేల మంది విద్యార్థులతో ర్యాలీ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు విద్యార్థులు రాహుల్‌ను కలిసి వర్సిటీల సమస్యలపై వివరించారు.

### గిరిజనులతో కలిసి రాహుల్ నృత్యం..



## ఏపీఈడీబీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా రోడ్ షోలు

### నవంబర్‌లో ముంబై, ఢిల్లీల్లో మెట్ ఎక్స్‌పో, ఇండియా కెమ్ సమావేశాలు

### వీటిలో పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరిస్తాం

అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా వరుస రోడ్ షోలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) సీఈవో జి.సృజన తెలిపారు. నవంబర్ మొదటి వారంలో ముంబై, ఢిల్లీల్లో నిర్వహించనున్న మెట్ ఎక్స్‌పో, ఇండియా కెమ్–2022కు అధికారులు హాజరవుతారని వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తారన్నారు. ఈ మేరకు హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల విధుల్లో ఉన్న సృజన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఈడీబీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏపీఈడీబీ రెండు కీలక రంగాలకు చెందిన అంతర్జాతీయ బిజినెస్ ఎక్స్‌పోల్లో భాగస్వామి అవుతుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్న ఇంజనీరింగ్–టెక్నాలజీ, కెమికల్స్–పెట్రో కెమికల్స్ రంగాలపై ముంబై, ఢిల్లీల్లో జరిగే అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొంటామని చెప్పారు. నవంబర్ 2 నుంచి 3 వరకు ఢిల్లీ ప్రగతి మైదాన్ వేదికగా ఫిక్కీ ఆధ్వర్యంలో కెమికల్స్–పెట్రోకెవి?కల్స్ రంగాలపై 'ఇండియా కెమ్ –2022'' పేరిట 11వ అంతర్జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. ఇందులో ఏపీ భాగస్వామ్య రాష్ట్రంగా చేరడంతో ప్రత్యేక స్టాల్స్, సీఈవో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సెమినార్లలో పాల్గొనే అవకాశం లభించిందని తెలిపారు. వీటిని వినియోగించుకోవడం ద్వారా విశాఖ–కాకినాడ పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్)తో పాటు పీఎల్ఐ స్కీమ్ కింద రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను అధికారులు వివరిస్తారన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలోని అధికారుల బృందం హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. అలాగే మెటీరియల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో ఇండియాలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించే విధంగా నవంబర్ 2 నుంచి 4 వరకు ముంబైలో మెట్ ఎక్స్‌పో జరుగుతుందని సృజన వెల్లడించారు. దీనికి వివిధ రంగాలకు చెందిన 150 మందికిపైగా పారిశ్రామికవేత్తలు హాజరవుతారన్నారు. మెట్ ఎక్స్‌పోలో అల్ట్రాటెక్, రిలయన్స్, జేఎస్‌డబ్ల్యూ, అక్జో నోబెల్, మహీంద్రా, టాటా స్టీల్ వంటి కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరుపుతామని వివరించారు. డిసెంబర్‌లో తైవాన్, జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో రోడ్ షోలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సృజన అధికారులను కోరారు. రాష్ట్రంలోకి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా ఈ రోడ్‌షోలను నిర్వహించనున్నామని తెలిపారు.



## విశాఖను దోపిడీ రాజధానిగా మారుస్తున్నా జగన్మోహన్ రెడ్డి

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు



అమరావతి అక్టోబర్ 29 జగన్మోహన్ రెడ్డి దోపిడీ రాజధానిగా విశాఖను మారుస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు విమర్శించారు. శనివారం విజయవాడలో నిర్వహించిన నాగుల చవితి వేడుకల్లో అచ్చెన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర లూటీని అడ్డుకుంటున్నామనే మంత్రులు కుక్కల్లా మొరుగుతున్నారని వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాంధ్ర మంత్రుల దోపిడీ ప్రజలందరి కళ్ళకు కనిపిస్తోందని తెలిపారు. నేతల స్వార్థం కోసమే ప్రాంతీయ చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ అంటే జే గ్యాంగ్ అడ్డా కాదన్నారు. ప్రకృతి సంపద రుషికొండను కొల్లగొట్టి కట్టుకునే ప్యాలెస్ ద్వారా జగన్మోహన్ రెడ్డి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి బండారం బయటపడుతుందనే నిన్న టీడీపీ నాయకుల్ని అడ్డుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని ఏంటి అని ఎవరడిగినా చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితికి ఏపీని తీసుకొచ్చారన్నారు. సాక్షి పాలేగాళ్ళు రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, అన్ని ప్రభుత్వ శాఖల్లో సాక్షి సిబ్బందిని పెట్టి సజ్జల పర్యవేక్షిస్తున్నారని అచ్చెన్న విమర్శించారు. సుదీర్ఘ కాలం అన్ని పార్టీల్లో మంత్రులుగా చేసిన వైసీపీ నేతలు ఉత్తరాంధ్ర అభివృద్ధి చేస్తామంటే ఎవరు వద్దన్నారని అన్నారు. రైతుల పాదయాత్రపై వైసీపీ నేతలు దండయాత్ర చేస్తున్నారన్నారు. మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో దుర్మార్గుడి పాలన సాగటం వల్ల 40ఏళ్ళు వెనక్కి వెళ్లామని చెప్పారు. పులివెందులలో కూడా గెలవలేని జగన్మోహన్ రెడ్డి ప్రజలకి 175 గెలుస్తామనే భ్రమ కల్పిస్తున్నారన్నారు. ప్రజలు తనకు ఎందుకు ఓటేయాలో చెప్పే ఒక్క మంచి కారణం కూడా జగన్మోహన్ రెడ్డి వద్ద లేదని తెలిపారు. ఒక్క అవకాశంతో ప్రజలకు ఉన్న భ్రమలన్నీ తొలిగిపోయాయన్నారు. పిచ్చి వాళ్లే పొత్తులు గురించి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని... రాజకీయాల్లో పొత్తులు సర్వసహజమని చెప్పుకొచ్చారు. ప్రజా స్వామ్యాన్ని కాపాడుకునేందుకే కలిసొచ్చే పార్టీలను కలుపుకుని పోతామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## వికేంద్రీకరణ గురుంచి మాట్లాడే నేతలకు అభివృద్ధిపై అవగాహన ఉందా

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు ఆగ్రహం

శ్రీకాకుళం అక్టోబర్ 29 రాష్ట్రంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న స్పీకర్, మంత్రులు అర్ధరహితమైన భాష మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... రాజకీయాలు తప్ప అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. అధికార పార్టీ నేతలు రమ్యమైన రాజకీయం నడుపుతున్నారని అన్నారు. రూ.800 కోట్లు ఖర్చు పెడితే సిక్కోలు సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. వికేంద్రీకరణ గురుంచి మాట్లాడే నేతలకు అభివృద్ధిపై అవగాహన ఉందా అని ప్రశ్నించారు. స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మానకు ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తెచ్చే దమ్ము ఉందా అని నిలదీశారు. అమరావతిలోనే రాజధాని ఉంటుందని జగన్ చెప్పారని...ఇప్పుడు అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు వికేంద్రీకరణ గురుంచి ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. అమరావతి రైతుల పాదయాత్ర పై దాడి చేయటం, అడ్డుకోవడం ఊక దంపుడు చర్య అని వ్యాఖ్యలు చేశారు. అమరావతి రైతులు సిక్కోలు వరకు ఎందుకు రాకూడదో చెప్పాలన్నారు.



వికేంద్రీకరణ గురుంచి మాట్లాడే అర్హత వైసీపీ నేతల కు లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో జరిగే పనులు తప్పా ఒక్క పనైనా చేపట్టారా అని ప్రశ్నించారు. రాజధాని పేరుతో విబేధాలు సృష్టించటం మానుకోవాలని హితవుపలికారు. అమరావతి రైతులపై అక్కసుతోనే వికేంద్రీకరణ అంటున్నారని తెలిపారు. పేదలకు ఇచ్చే ఇళ్లకు జగనన్న ఇల్లు అనే పేరు పెట్టుకోవటానికి వీలు లేదన్నారు. జగనన్న కాలనీలపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. విభజన హామీలను బీజేపీ అమలు చేసిందని తెలిపారు. మూడు రాజధానులు పేరుతో డ్రామాలు వద్దని సోమువీర్రాజు పేర్కొన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 30-10-2022

## ఇక సినిమా వ్యూహాలేనా

నిమాలకూ, రాజకీయాలకూ అవినాభావ సంబంధం ఉంది. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే శక్తి సినిమాకుఉంది. మావో వంటి విప్లవ నాయకుడే ప్రపంచంలోకెల్లా శక్తిమంతమైన మాధ్యమంగా సినిమాను అభివర్ణించారు. తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు రాజకీయ రంగ ప్రవేశం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్నే మార్చివేసిన సంగతి తెలిసిందే. ఆ తరువాత తెలుగు రాష్ట్రాలలో ఎందరో నటులు రాజకీయ రంగ ప్రవేశం చేసినా ఎన్టీఆర్ స్థాయి విజయాలను అందుకోవడంలో విఫలమయ్యారు. ఇక రాజకీయ ప్రవేశం కంటే.. రాజకీయ సినిమాల ద్వారా 'సంపాదన' బాగుంటుందని కొందరు సినీ జీవులు ఆ బాటపట్టారు. గతంలో కూడా రాజకీయాలు సెంటర్ సబ్జెక్ట్ గా సినిమాలు వచ్చిన ఉదంతాలు ఉన్నాయి కానీ.. రాష్ట్ర విభజన తరువాత మాత్రం రాజకీయ సిద్ధాంతాల ప్రాతిపదికన కాకుండా రాజకీయ నాయకుల ప్రచారమే ధ్యేయంగా సినిమాల నిర్మాణం ప్రారంభమైంది. మరీ ముఖ్యంగా ఒక పార్టీ నేతను అన్ పాపులర్ చేయాలన్న లక్ష్యంతో సినిమా నిర్మాణానికి ముందుకు రావడమన్న ఒక కు సంస్కృతి మొదలైంది. అందుకు ఉదాహరణగా గత ఎన్నికలకు ముందు విడుదలైన లక్ష్మీస్ ఎన్టీఆర్ సినిమాను చెప్పవచ్చు. ఆ సినీమా ముఖ్య ఉద్దేశం అప్పటి ప్రతిపక్ష నేత జగన్ కు అనుకూలంగా ఉండేలా అప్పటి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుకు నష్టం చేకూర్చాలన్నదే ముఖ్య ఉద్దేశం. అదే సమయంలో ఎన్టీఆర్ బయోపిక్, యాత్ర అంటూ వైఎస్ఆర్ పాదయాత్రలపై సినిమాలు వచ్చినా వాటిలో ఇలా ప్రత్యర్థులను తూర్పారపట్టాలన్న ఉద్దేశం, లక్ష్యం ఏమీ కనిపించవు. కానీ లక్ష్మీస్ ఎన్టీఆర్ సినిమా లక్ష్యం మాత్రం ఒక పార్టీకి నష్టం చేకూర్చడం.. ఆ పార్టీ అధినేత వ్యక్తిత్వ హననానికి పాల్పడటమేనని పరిశీలకులు సైతం అప్పట్లో పరిశీలకులు విశ్లేషించారు. ఇప్పుడు మళ్లీ 2024 ఎన్నికలు లక్ష్యంగా మరోసారి అదే ప్రయత్నం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి జగన్ కు, అధికార వైసీపీకి ప్రయోజనం చేకూర్చేదిగా.. ప్రత్యర్థులకు నష్టం చేకూర్చడమే లక్ష్యంగా వివాదాస్పద దర్శకుడు రామగోపాల వర్మ వ్యూహం సినిమాకు రూపకల్పన చేస్తున్నట్లు స్వయంగా ప్రకటించారు. అయితే ఈ సారి మాత్రం ఆయన సినిమాకు దీటుగా జనసేన తమ అధినేతకు మేలు చేకూర్చేలా ప్రతి వ్యూహం పేర ఒక సినిమా తీసేందుకు సన్నద్ధమౌతున్నట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. వర్మ తీసే ఈ వ్యూహం, శపథం అనే రెండు సినిమాలూ ఏపీ సీఎం జగన్, అధికార వైసీపీకు మద్దతుగా ఉంటాయని, తెలుగుదేశం, జనసేనలపై విమర్శలు, విసుర్లు ఉంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దీంతో వైకాపాని టార్గెట్ చేస్తూ 'ప్రతివ్యూహం' అనే సినిమాని రూపొందించేందుకు జనసేన అభిమానులు, కార్యకర్తలు రంగంలోకి దిగారని అంటున్నారు. ఇదే క్రమంలో తన బయోపిక్ వ్యూహం చిత్ర కథకు సంబంధించిన వివరాలు కూడా వర్మ ఇవాళ ట్విట్టర్ లో వెల్లడించారు. వ్యూహం చిత్ర నిర్మాత గతంలో తనతో వంగవీటి సినిమా తీసిన దాసరి కిరణ్ అని వర్మ తెలిపారు. అహంకారానికి, ఆశయానికి మధ్య జరిగిన పోరాటం నుంచి ఉద్భవించిన వ్యూహం కథ అని వర్మ లీక్ ఇచ్చారు. అలాగే ఇది రాజకీయ కుట్రల విషంతో నిండి ఉంటుందన్నారు. రాచకురుపు మీద వేసిన కారంతో బొబ్బలెక్కిన ఆగ్రహానికి ప్రతీకాష్టే వ్యూహం చిత్రమని రాంగోపాల్ వర్మ వెల్లడించారు. సరిగ్గా.. వర్మ 'వ్యూహం' సినిమా విడుదలయ్యే రోజునే . 'ప్రతివ్యూహం' కూడా విడుదల చేయాలని భావిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి ఈ ఎన్నికలలో ప్రచార వ్యూహాలన్నీ వెండి తెరపై కనిపిస్తాయని చెప్పవచ్చు.

# పీకే ఓకే అంటేనే టిక్కెట్లు

విజయవాడ, అక్టోబరు 29,వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండు రోజుల కింద టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో 71 మంది టెక్కలి నేతలు పాల్గొన్నారు. వారిలో 40 మంది వచ్చే ఎన్నికల్లో టెక్కలి అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ వద్దని నేరుగా సీఎం జగన్‌కు చెప్పారు. కానీ ఆయన మాత్రం వారి అభ్యంతరాలను పట్టించుకోలేదు. అభ్యర్థిగా దువ్వాడను ఖరారు చేశారు. అందరూ కలిసి గెలిపించుకుని రావాల్సిందేనని ఆదేశించారు. దీంతో టెక్కలి క్యాడర్ ఆశ్చర్యపోయింది. దీనికి కారణం.. అక్కడ క్యాడర్ అభిప్రాయాలు ఎలా ఉన్నా.. అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ ఉండాల్సిందేనని ఐ ప్యాక్ టీం నివేదిక ఇవ్వడమే కారణం. ఒక్క టెక్కలి విషయంలోనే కాదు.. నియోజకవర్గాల్లో పార్టీ నేతల అసంతృప్తి ఉందని భావిస్తున్న ఇతర నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను జగన్ ఇలా ఖరారు చేయడానికి పీకే టీం నివేదికల్నే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయం వెనుక ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు ఉన్నాయి. ఆయన జగన్మోహన్ రెడ్డి కోసం ప్రత్యేకంగా పని చేశారు. సోషల్ మీడియా స్ట్రాటజీలు ఉపయోగించారు. సామాజిక సమీకరణాలు చూశారు. ఇలా అన్నీ పకడ్బందీగా ఉండటం.. వారు చేసిన సర్వేలన్నీ పక్కాగా ఉండటంతో జగన్ నమ్మకాన్ని పొందారు. ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ సొంత రాజకీయం చేసుకుంటూ బీహార్‌లో పాదయాత్ర చేస్తున్నారు కానీ.. ఏపీలో ఐ ప్యాక్ టీం మాత్రం పని చేస్తోంది. పీకేకు సన్నిహితుడైన రిషి రాజ్ నేతృత్వంలో ఏపీలో పీకే టీం పని చేస్తోంది. ఇటీవల తెలంగాణలో పీకే టీం పని ఆపేసింది. ఆ సిబ్బంది అంతా ఏపీకి వచ్చారు. దీంతో నియోజకవర్గాల్లో పరిస్థితులను వారు ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ జగన్‌కు నివేదికలు ఇస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కూడా పూర్తిగా ఐ ప్యాక్ టీం ఆలోచన. ఆ టీం కనుసన్నల్లోనే ఆర్గనైజ్ చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు.. ఇంచార్జులు ఎలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారనేది ప్రతీ రోజూ నివేదికలు పంపుతున్నారు. ప్రతీ నెలా సమీక్ష పెట్టి జగన్ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు జారీ చేసేది ఈ ఐ ప్యాక్ టీం ఇచ్చే నివేదికలను బట్టే. అవన్నీ ఖచ్చితంగా ఉంటున్నాయి. ఎమ్మెల్యేలు ఎవరెవరు గడప గడపకూ వెళ్లడంతో లేదో.. తెలిసిపోతోంది. ఈ కార్యక్రమంపై ప్రజల్లో వ్యతిరేక ప్రచారం జరుగుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కానీ జగన్ మాత్రం ఎట్టి పరిస్థఇతుల్లోనూ చేయాలని ఆదేశిస్తున్నారు. దీనికి కారణం ....ఇలా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలు చెప్పడం ద్వారా.. ప్రభుత్వమే మన దగ్గరకు వచ్చిందని ప్రజలు భావిస్తారని పీకే టీం ఎక్స్ ప్లెయిన్ చేయడమేనని అంటున్నారు. నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పీకే టీం నివేదికలపై ఆధారపడి ఉంటుందని జగన్ పదే పదే చెబుతున్నారు. పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచిస్తున్నారు. ఈ ప్రకారం ఎమ్మెల్యేలు కూడా ... ఆ దిశగా ప్రయత్నిస్తున్నారు. అయితే పలువురిలో మాత్రం తమ కంటే ప్రశాంత్ కిశోర్ బృందాన్నే జగన్ ఎక్కువగా నమ్ముతున్నారన్న అసంతృప్తికి గురవుతున్నారు. అయితే ఈ విషయంలో జగన్ ఏ మాత్రం మొహమాటానికి పోవడం లేదని.. సర్వేల విషయంలో పీకే టీం ఇచ్చేవాటికే కాకుండా మరో రెండు స్వతంత్ర సంస్థలతోనూ సర్వేలు చేయిస్తున్నారని చెబుతున్నారు. వైఎస్ఆర్‌సీపీలో పీకే ప్రభావం ఎక్కువగా ఉందని 2019 ఎన్నికల ముందూ ప్రచారం జరిగింది. ఇప్పుడూ అలాంటి పరిస్థితే వైఎస్ఆర్‌సీపీలో ఉంది. కానీ ఏదైనా విజయం కోసమేనని.. ఐ ప్యాక్ పనితీరుపై జగన్ సంతృప్తిగా ఉన్నారని అంటున్నారు.

# తక్కువ రేట్లకే అమరావతి స్థలాలు

గుంటూరు, అక్టోబరు 29, ఏపీ రాజధాని అమరావతిలో భాగం అయిన మంగళగిరి ప్రాంతంలో ఇంటి స్థలం కొనాలంటే సామాన్యులకు చాలా కష్టం. కానీ ప్రభుత్వం అక్కడ వేసిన లే ఔట్ తో ఆ సమస్య తీరిపోతోంది. ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న స్మార్ట్ టౌన్‌షిప్‌లోని ప్లాట్లను ఈ-వేలం వేస్తున్నారు. ఈ ఫ్లాట్లు కొనుగోలు చేసే వారికి అనేక రకాల రాయితీలను ప్రభుత్వం కల్పిస్తోంది. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సులభ వాయిదాల్లో నగదు చెల్లించే అవకాశం కూడా ఉంది. దీనికి సంబంధించిన ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయింది. మంగళగిరి నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు లే-అవుట్‌లోని 10 శాతం ప్లాట్లు రిజర్వు చేశారు. అలాగే వారికి 20 శాతం రాయితీ కల్పిస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులకు 5 శాతం ప్లాట్లను రిజర్వు చేశారు. ఆసక్తి గలవారు ప్లాట్ ధరలో 10 శాతం మొత్తం చెల్లించి ప్లాట్ బుక్ చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అందిన దరఖాస్తులకు ఈ-లాటరీ నిర్వహిస్తారు. అందులో ఎంపికైనవారు ప్లాట్ కేటాయించిన నెలలోపు ఒప్పందం చేసుకుని ధరలో 30 శాతం సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం 6 నెలల్లో మరో 30 శాతం మొత్తం, ఏడాదిలోపు మిగిలిన 30 శాతం మొత్తం ధర చెల్లించవచ్చు. ప్లాట్ పొందిన వారు ధర మొత్తం ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తున్నారు. ప్లాట్ ధర మొత్తం ముందే చెల్లిస్తే వెంటనే రిజిస్ట్రేషన్ చేస్తారు. వాయిదాలో పద్దతిలో అయితే మాత్రం.. మొత్తం వాయిదాలు చెల్లించిన తర్వాతనే రిజిస్ట్రేషన్ చేస్తారు. రిజిస్ట్రేషన్ చార్జీల్లోనూ రాయితీ ఉంది. ఎంఐజీలో ప్లాట్లు కొనుగోలు చేసే వారికి ప్రభుత్వం నికర అమ్మకపు ధరలో 60 శాతం మీద మాత్రమే రిజిస్ట్రేషన్ చార్జీలు ఉంటాయి. మిగతా నలభై శాతానికి డిస్కౌంట్ లభిస్తుంది. ఎంఐజీ లే అవుట్-2లో మొత్తం 267 ప్లాట్లు ఉన్నాయి. వీటిలో 200 చదరపు గజాల్లో 68, 240 చదరపు గజాల్లో 199 ఉన్నాయన్నారు. చదరపు గజం ధర రూ.17,499గా నిర్ణయించారు. ఈ ప్లాట్లను బుక్ చేసుకోవాలకునే ఆసక్తి కలవారు.. పది శాతం ప్రారంభ ధర చెల్లించి నవంబర్ 19వ తేదీ లోగా .తిని వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్లాట్లకు అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు ఉంటాయి. భవిష్యత్‌లో కూడా ఎలాంటి సమస్యా రాలేదు ఇతర వివరాలకు 0866-2527124 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అయితే అమరావతి నుంచి రాజధానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తరలించేస్తామని ప్రభుత్వం చెబుతూండటంతో.. ఇప్పటి వరకూ పలుమార్లు ఆన్ లైన్ వేలం నిర్వహించినా ప్రయోజనం పెద్దగా స్పందన లేదు. ఈ సారి అనేక రాయితీలు ఇవ్వడంతో ముందుకు వస్తారని సీఆర్డీఏ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మాస్టర్ ప్లాన్ లో మార్పులు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. పేదల ఇళ్ల కోసం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేస్తూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు రాజధాని పరిధిలోని ఐదు గ్రామాలలో 900.97 ఎకరాలను కేటాయించింది. మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు.. తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలు గ్రామాల్లో ఆర్-5 జోనింగ్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అభ్యంతరాలు, సూచనలను 15 రోజుల్లోగా చెప్పాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో సూచించింది. అక్టోబరు 28 తేదీ నుంచి నవంబరు 11వ తేదీ వరకూ 15 రోజుల పాటు సీఆర్డీఏకు అభ్యంతరాలుంటే చెప్పాలని స్పష్టం చేసింది. సీఆర్‌డీఏ ప్రతిపాదనల ఆధారంగా ఆర్-5 జోన్ పేరిట పేదల ఇళ్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

# ఏనుగుల మంద బీభత్సం



విజయనగరం, అక్టోబరు 29,పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలో ఏనుగుల మంద బీభత్సం సృష్టించింది. గంగులువాని చెరువు దగ్గర ఉన్న 2 ఆవులను, ఒక లేగ దూడను ఏనుగులు తొక్కి చంపాయి. మరోవైపు మిర్తివలసలోనూ ఆవుల మందపై ఏనుగులు దాడి చేశాయి. దీంతో ఏనుగుల బీభత్సంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పంట పొలాలకు వెళ్లాలంటే భయబాంత్రులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. నాలుగు ఏళ్లుగా మన్యం వాసులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల తరలింపులో అధికారులు, ప్రజా ప్రతినిధులు అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. ఏనుగుల దాడిలో వేల ఎకరాలు పంట నష్టం వాటిల్లిందని, మూగ జీవాలు కూడా ప్రాణాలు కోల్పోతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏనుగులను తరలించాలని కోరుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం నియోజకవర్గంలోని బలిజిపేట మండలం వెంగాపురం గ్రామంలో నాలుగు ఏనుగులు బీభత్సం సృష్టించాయి. పంట పొలాలన్నీ నాశనం చేశాయి. విజయనగరం జిల్లా రాజాం మండలంలో ఉన్న ఈ ఏనుగురు అర్ధరాత్రి 25 కిలోమీట్లర మేర ప్రయాణం చేసి వెంగాపురం గ్రామ సమీపంలోని పంటపొలాలపై పడి పరుగులు పెట్టాయి. తొక్కి తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల అరుపులతో విషయం గుర్తించిన గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చేతికి వచ్చిన పంటను నాశనం చేయడం చూసి కన్నీరుమున్నీరయ్యారు. అయితే అవే ఏనుగులు మరోసారి ఆవులు, లేగదూడపై దాడి చేయడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. తిరుమల కొండపై ఏనుగుల సంచారం భక్తులను కలవరపెడుతుంది. కొన్ని రోజులుగా తిరుమల ఘాట్ రోడ్డులో ఏనుగులు సంచరిస్తుండడంతో భక్తులు భయాందోళనకు గురి అవుతున్నారు. ఆదివారం సాయంత్రం మొదటి ఘాట్ రోడ్డులోని ఎలిఫాంట్ ఆర్చ్ వద్ద 11 పెద్ద ఏనుగులు, మూడు చిన్న ఏనుగుల గుంపును చూసిన వాహనదారులు భయంతో వాహనాలను నిలిపివేసి అటవీ శాఖా అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోనికి తరిమే ప్రయత్నం చేస్తున్నారు. భక్తులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టీటీడీ అటవీ శాఖ అధికారులు తెలిపారు. తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఒంటరి ఏనుగు గురువారం కలకలం రేపింది. గురువారం సాయంత్రం మొదటి ఘాట్ రోడ్డుకు అనుకోని ఉన్న అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు ఒక్కసారిగా ఘాట్ రోడ్డు దాటుతూ భక్తులకు కనిపించింది. ఒంటరి ఏనుగు ఘీంకారాలకు ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురైయ్యారు. ఎలిఫెంట్ ఆర్చ్ కు సమీపంలో ఒంటరి ఏనుగు చూసిన వాహన చోదకులు వాహనాలు నిలిపివేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విజిలెన్స్ సిబ్బంది వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. వెంటనే అక్కడ చేరుకున్న అటవీ శాఖ అధికారులు భారీగా సైరన్ మోగించి ఒంటరి ఏనుగును అటవీ ప్రాంతంలోకి పంపే ప్రయత్నం చేస్తున్నారు. తరచూ అదే ప్రాంతంలో ఏనుగులు సంచరించడం గమనార్హం

# ముంబైని మించిన విశాఖ

విశాఖపట్టణం, అక్టోబరు 29, దేశ రాజధాని ఢిల్లీతోపాటు చాలా నగరాల్లో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. దీపావళి తర్వాత రోజున అంటే లెక్కలు చూస్తే పరిస్థితి ఏంటో అర్థమవుతుంది. దీపావళి తర్వాత, దేశ రాజధాని ఢిల్లీ గాలి నాణ్యత అక్టోబర్ 25 ముంబై కంటే అధ్వాన్నంగా ఉంది. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సిడిసి) వెబ్సైట్ ప్రకారం... ఢిల్లీ వాయు నాణ్యతా సూచిక మంగళవారం ఉదయం 325గా నమోదైంది. అంటే అక్కడి గాలి పీల్చేందుకు అనువుగా లేదని అర్థం. ముంబైలో ఏక్యూఐ 198గా నమోదైంది. వెబ్ సైట్ ప్రకారం, ఇది బ్యాలెన్స్‌డ్ కేటగిరీలో ఉన్నట్టు అర్థం. దేశంలోని మరో రెండు మెట్రో నగరాలు చెన్నై, కోల్‌కతా లో వరుసగా 233, 38 ఎక్యూఐని నమోదు చేశాయి. చెన్నై గాలి 233 ఎక్యూఐతో పేలవమైన విభాగంలో ఉందని నివేదిక చెబుతోంది. 38 ఎక్యూఐతో కోల్ కతా గాలి చాలా స్వచ్ఛమైనదిగా చెబుతోంది. లేటెస్ట్ లెక్కల ప్రకారం హైదరాబాద్, విశాఖలో గాలి నాణ్యత చూస్తే కాస్త జాగ్రత్త పడాల్సిన టైం వచ్చిందని తెలుస్తోంది. హైదరాబాద్ ప్రస్తుతం మధ్యస్థంగా ఉన్నప్పటికీ.. విశాఖలో గాలి నాణ్యత పేలవంగా ఉంది. హైదరాబాద్ 161తో ఉంటే విశాఖ దానికి డబుల్ 241గా చూపిస్తోంది. ముంబైలో గాలి నాణ్యత 198 ఉంటే... విశాఖలో సుమారు 250 ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో గాలి నాణ్యత ఇలా ఉంది

అనంతపురం- 183

ఏలూరు- 70

రాజమండ్రి- 93

తిరుపతి- 70

దీపావళి రెండవ రోజున ఢిల్లీ ఎక్యూఐ చాలా పేలవమైన కేటగిరీలో ఉంది. కానీ గత సంవత్సరం పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉండేది. 2021 దీపావళి మరుసటి రోజు ఢిల్లీలో ఏక్యూఐ 462గా నమోదైంది. గత ఏడేళ్లుగా దీపావళి మరుసటి రోజు ఢిల్లీ ప్రజలు విషవాయువులు పీలుస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీ ఏక్యూఐ 2016లో 445, 2017లో 407, 2018లో 390, 2019లో 368, 2020లో 435, 2021లో 462గా నమోదైంది. దీపావళి తర్వాత రోజున గాలి నాణ్యత క్షీణించడం వెనుక ఉన్న కారణాలలో ఒకటి బాణాసంచా నుంచి వచ్చే పొగ అని చెబుతారు నిపుణులు. ఢిల్లీలో నిషేధం ఉన్నప్పటికీ, బాణసంచా కాల్చారు. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను కాల్చడం కూడా ఢిల్లీలో కాలుష్యానికి కారణమని భావిస్తున్నారు.

## ఆర్జీవీ కథపై కన్ఫ్యూజింగ్ స్టేట్‌మెంట్



విజయవాడ, అక్టోబరు 29, సినిమా కంటెంట్ తెలిసిపోయింది. ఎవరిని టార్గెట్ చేస్తున్నారో అర్థమైపోయింది. ఇప్పటి వరకు నడిచిన ఊహాగానాలకు తెరదించారు వివాదాల దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. మూడు రోజులుగా జరుగుతున్న ప్రచారానికి తగ్గట్టుగానే ఆయనో ట్వీట్ చేశారు. ఏ కాన్సెప్ట్‌లో సినిమా తీస్తున్నానో చెప్పేశారు. వివాదాలకు వెతుక్కొని వెళ్లి మరీ కెలుక్కొని రామ్‌గోపాల్ వర్మ మరోసారి రాజకీయాలను టచ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం సీఎం జగన్‌తో సమావేశమైన అనంతరం రాజకీయాలపై సినిమాలు వస్తున్నాయన్న ఊహాగానాలకు తెరలేచింది. ఎవరిని టార్గెట్ చేయబోతున్నారు.. ఎవరిపై సినిమాలు తీస్తారనే చర్చ జోరుగా నడిచింది. ఈ చర్చ నడుస్తుండగానే... ఆర్జీవీ గురువారం వరసు ట్వీట్లతో తాను చేయబోయే సినిమాలపై క్లారిటీ ఇచ్చేచారు. దాచుకోవడానికి ఏం లేదని... తాను రాజకీయాలపై సినిమా తీయబోతున్నానని చెప్పేశారు. పనిలో పనిగా పేర్లు కూడా ప్రకటించేశారు. రాజకీయాలపై తాను తీయబోయే సినిమా టూ పార్ట్స్‌లో ఉంటుందని వివరించారు ఆర్జీవీ. మరో ట్వీట్ చేసిన ఆర్జీవీ తాను తీయబోయే వ్యూహం సినిమాలో ఎలాంటి కంటెంట్ ఉంటుందో వివరించారు. ఃఏఖ్శ ఖఐ లీ అఃఔ - ఒూఐఝాఊ + ఏంఉంఔ = వ్యూహం అంటూ ఓ కన్ఫ్యూజింగ్ స్టేట్‌మెంట్ పాస్ చేశారు. సీఎం జగన్‌తో భేటీ తర్వాత జగన్ తాను ఎలాంటి సినిమా తీయనున్నారో వెంటనే ప్రకటించారు. తన కొత్త సినిమాకు "వ్యూహం" అని పేరు పెట్టారు. తాను తీయబోయేది బయోపిక్ కాదు?బయో పిక్ కన్నా లోతైన రియల్ పిక్ అని ఆర్జీవీ ప్రకటించారు. బయో పిక్‌లో అయినా అబద్దాలు ఉండొచ్చు కానీ, రియల్ పిక్‌లో నూటికి నూరు పాళ్ళు నిజాలే ఉంటాయని ప్రకటించారు. అహంకారానికి , ఆశయానికి మధ్య జరిగిన పోరాటం నుంచి "వ్యూహం" కథ వచ్చిందన్నారు. రాజకీయ కుట్రల విషంతో నిండి ఉంటుందన్నారు. రాచకురుపుపైన వేసిన కారంతో బొబ్బలెక్కిన ఆగ్రహానికి ప్రతికాష్టే "వ్యూహం" చిత్రం అని ఆర్జీవీ ప్రకటించారు. సినిమాకు నిర్మాతగా దాసరి కిరణ్ ఉంటారని ఆర్జీవీ ప్రకటించారు. అయితే ఈ రియల్ పిక్ ఒక సినిమా కాదని రెండు సినిమాలని చెబుతున్నారు. వ్యూహం .., తర్వాత శపథం అని రెండు సినిమాలు ఉంటాయన్నారు. ప్రేక్షకులకు షాక్ ఇస్తామన్నారు రామ్‌గోపాల్ వర్మ.

## విశాఖ రైల్వే డివిజన్ కలసాకారం దిశగా..

విశాఖపట్టణం, అక్టోబరు 29, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నాళ్లుగానో వేచి చూస్తున్న తరుణం రానే వచ్చింది. ఉత్తరాంధ్ర జీవ నాడిగా భావిస్తున్న విశాఖ రైల్వే డివిజన్ కల నెరవేరే సమయం ఆసన్నమైంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటుకానున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు శంకుస్థాపన చేసేందుకు ముహూర్తం కుదిరింది. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధానితో కలిసి రైల్వేజోన్ శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రధాని విశాఖ పర్యటనలో భాగంగా వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. నవంబర్ 11న విశాఖ చేరుకోనున్న పీఎం మోడీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి నేరుగా తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి చేరుకుంటారు. కాసేపు ఈఎన్‌సీ అధికారులతో రక్షణ రంగంపై చర్చించి రాత్రి అక్కడే బస చేస్తారు. 12వ తేదీ ఉదయం ఏయూ గ్రౌండ్స్‌కి చేరుకుంటారు. అక్కడ భారీ బహిరంగ సభకు హాజరవుతారు. ఈ వేదిక నుంచే పలు కీలక కార్యక్రమాలకు ప్రధాని శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ప్రధాని మోడీ, సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారు. రూ.120 కోట్లతో జోన్ ప్రధాన కార్యాలయం నిర్మిస్తారు. విశాఖ శివారు వడ్లపూడిలో రైల్వే అనుబంధ సంస్థ ఆర్‌వీఎన్‌ఎల్ రూ.260 కోట్ల వ్యయంతో నిర్మించిన వ్యాగన్ వర్క్‌షాప్‌ను జాతికి అంకితం చేస్తారు. రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌ఎల్‌డీఏ) నేతృత్వంలో రూ.446 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. గంభీరంలో రూ.445 కోట్లతో మొదటి విడతలో నిర్మించిన ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌నూ ప్రారంభిస్తారు. అంతే కాకుండా రూ.380 కోట్లతో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి, ప్రధాని శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు రైల్వే, ఇతర కేంద్ర సంస్థలకు సంబంధించిన పలు పనులను ప్రారంభిస్తారు. ఆ తర్వాత ప్రధాని మోడీ, సీఎం జగన్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ప్రధాని పర్యటన సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# బెంగళూరు టూ విజయవాడ...

ఒంగోలు, అక్టోబరు 29, బెంగళూరు-విజయవాడకు నాలుగు లైన్ల రహదారి కోసం రాష్ట్రంలో భూసేకరణ ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వం మారినప్పుడల్లా కొత్త రహదారులు తెరపైకి వస్తున్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అనంతపురం-అమరావతి రహదారి నిర్మాణం భూసేకరణ సమయంలో ఆగిపోయింది. కేంద్రం ప్రభుత్వం ఇటీవల బెంగళూరు నుంచి విజయవాడ వరకూ ఎక్స్‌ప్రెస్‌వేను ప్రకటించింది. ఇందులో కొంత పాత రహదారిపోనూ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పేరుతో నూతనంగా 342 కిలోమీటర్ల పొడవున రోడ్డును కొత్తగా వేయనున్నారు. దీనివల్ల ఈ ప్రధాన నగరాల మధ్య 70 కిలోమీటర్లు వరకూ దూరం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రయాణ సమయం కూడా చాలా వరకూ తగ్గుతుందని అంచనా వేశారు. ఈ రహదారి దాదాపుగా ఎక్కువ వంపులు లేకుండానే సాగుతుంది. రాష్ట్రంలో శ్రీసత్యసాయి జిల్లా, వైఎస్ఆర్ జిల్లా, ప్రకాశం జిల్లాల్లో కొత్తగా రహదారి నిర్మాణం జరగనుంది. మిగిలిన జిల్లాల్లో పాత రోడ్డులో దీనిని కలపనున్నారు. బెంగళూరు నుంచి విజయవాడ వరకూ 530 కిలోమీటర్ల రోడ్డు ఉంది. పాత జాతీయ రహదారిపోనూ మిగతా రహదారి కోసం భూసేకరణ మొదలైంది. రాష్ట్రంలో సత్యసాయి జిల్లా కొడికొండ నుంచి ప్రకాశం జిల్లా ముప్పవరం వరకూ ఈ

## వేగంగా భూసేకరణ పనులు

భూసేకరణ జరగాల్సి ఉంది. ఇందుకోసం ఎన్ని ఎకరాలు కావాలనేదీ అధికారులు ఇంకా తేల్చలేదు. ప్రకాశం జిల్లాలో మంగళవారం నాడు జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు తాళ్లూరు మండలం శివరామపురంలో రహదారి కోసం సేకరించే భూములను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతులు తమ సందేహాలను అధికారులకు చెప్పుకున్నారు. గతంలో అనంతపురం నుంచి అమరావతి వరకూ చేపట్టే రహదారికి కూడా భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. అప్పట్లోనూ రైతులకు పరిహారంపై స్పష్టత లేదు. భూముల ధరలు నిర్ణయించలేదు. అయితే, ఆ రహదారి ఆగిపోయింది. ఇప్పుడు కొత్త రహదారి కోసం సేకరించే భూములకు ఎంత ధర ఇస్తారనేదీ స్పష్టత లేదు. భూసేకరణ, ధరల నిర్ణయం, పరిహారాల చెల్లింపులు వంటివి రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. జిల్లాలో ఈ రహదారి వెళ్లే మార్గంలోని మండలాల్లో నివేదికలను అధికారులు తయారు చేస్తున్నారు. ఏయే గ్రామాల్లో నుంచి ఈ రహదారి వెళ్తుందనే సమాచారం ఇచ్చారు. దీంతో, ఆయా గ్రామాల రైతుల్లో కలవరం మొదలైంది. సాగు చేసుకుంటున్న భూములు ఖరీదైనవి. కొన్ని మండలాల్లో ఏడాదికి రెండు పంటలు పండే భూములు కూడా ఉన్నాయి. వీటిని కోల్పోతే ఎలా అనే ఆందోళన రైతుల్లో పెరుగుతోంది.ప్రకాశం జిల్లాలో సిఎస్‌పురం, వెలిగండ్ల, కనిగిరి, మర్రిపూడి, పొదిలి, తాళ్లూరు,చీమకుర్తి, అద్దంకి, జె.పంగులూరు మండలాల నుంచి ఈ రహదారివెళ్తుంది.ఈ మండలాల్లోని గ్రామాల్లో భూములకు మంచి గిరాకీ ఉంది. తాళ్లూరు, అద్దంకి మండలాల్లోని భూములకు నీటివసతి ఉండడంతో అన్ని రకాలపంటలూ పండుతాయి. భూములకు రైతులు ఎకరాకు రూ.50 లక్షలు కావాలని అడుగుతున్నారు. ప్రస్తుతం అన్ని మండలాల్లో ఎకరం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ ధర ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం వచ్చాక పామూరు,సిఎస్‌పురం మండలాల్లోనూ పలు కంపెనీలు వెంచర్లు వేశాయి. వ్యవసాయభూములు పట్టణాలకు దగ్గరలో ఉంటే ఎకరం రూ.రెండు నుంచి రూ.మూడు కోట్లు ధర ఉంది. పంటలు పండే భూములు కూడా ఎకరం కనీసం పాతిక లక్షల రూపాయలపైనే పలుకుతోంది. ఇప్పుడు ఎంత ధర ఇస్తారనే దానిపైనే రైతులు సందిగ్ధంగా ఉన్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రానందున భూములకు ఇచ్చే ధరలపై నోరువిప్పడం లేదు. ధర త్వరలోనే ప్రకటిస్తామని చెప్పి వెనుదిరుగుతున్నారు.


# రాహుల్ యాత్రను ప్రజలు పట్టించుకోవడంలేదు

తిరుమల తిరుమల శ్రీవారిని బిజెపి నేత విష్ణు వర్ధన్ రెడ్డి దర్శించుకున్నారు.. శనివారం ఉదయం విఐపీ విరామ సమయంలో ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియా మాట్లాడుతూ... ఏపి రాజకీయాలు దేశ ప్రజలలో ఆందోళన నింపుతున్నాయి అన్నారు.. లోకల్ పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాలలో అభివృద్ధి నిరోధక పాలనే సాగుతుంది అన్నారు.. ఆంధ్రప్రదేశ్ టిడిపి పాలనలో పదేళ్ళు, వైసిపీ పాలనలో మరో ఇరవై ఏళ్ళు అభివృద్ధిలో వెనక్కు నెట్టబడింది అని తెలిపారు.. కుటుంబ పాలనే పరమావధిగా నాడు టిడిపి, నేడు వైసిపీ వ్యవహరిస్తున్నాయని అన్నారు.. మిగిలిన ఈ 18 నెలలు వైసిపీ చేతగానితనాన్ని ఎండగట్టే విధంగా బీజేపీ, జనసేన ప్రజా అవగాహన ఉద్యమాలు చేపడుతుంది అన్నారు.. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలి అంటే అది కేవలం బిజేపీ, జనసేనలతోనే సాధ్యం అన్నారు.. తెలుగు రాష్ట్రాల విభజన తరువాత తెలంగాణనలో టిఆర్ఎస్ ఆడుతున్న రాజకీయ క్రీడ ప్రమాదకరమైనది అన్నారు.. సంతలో పశువుల్లా కొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో గత మూడు రోజులుగా నీచ రాజకీయాలు చేస్తున్నారు అని తెలిపారు.. నేడు దేశంలో ఉనికి కోసం పోరాటం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అనీ రాహుల్ పాదయాత్రను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు అన్నారు.. 2024లో కాంగ్రెస్ కు ప్రతిపక్ష హోదా సైతం దక్కదు అన్నారు..

# భారత అణుశక్తి పితామహుడు హోమి జహంగీర్ బాబా

## -నేడు ఆయన జయంతి

హోమి జహంగీర్ భాభా 1909 అక్టోబరు 30 బొంబాయి లో ఒక సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించారు. బాబా భారతీయ కేంద్రక భౌతిక శాస్త్రవేత్త, వ్యవస్థాపక డైరక్టరు, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ లో భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా




పనిచేసాడు. అతనిని "భారత అణు కార్యక్రమానికి పితామహుడు" అని పిలుస్తారు. అతను భాభా అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్మెంట్, ట్రోంబే కు వ్యవస్థాపక డైరెక్టర్. అతని గౌరవార్థం ఆ సంస్థకు భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అని పేరు పెట్టారు. భారత అభివృద్ధికి మూలస్తంభాలుగా ఉన్న టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ , అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్మెంట్, ట్రోంబే అణ్వాయుధాల సంస్థలకు అతను డైరెక్టర్‌గా పర్యవేక్షించాడు. అతనికి ఆడమ్స్ ప్రైజ్ (1942), పద్మభూషణ (1954) పురస్కారాలు లభించాయి. 1951, 1953?1956లలో అతను భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతికి నామినేట్ చేయబడ్డాడు. భాభా సాధారణంగా భారత అణుశక్తికి పితామహుడిగా గుర్తించబడ్డాడు. అంతేకాకుండా, యురేనియం నిల్వల కంటే దేశంలోని విస్తారంగా లభ్యమవుతున్న థోరియం నిల్వల నుండి శక్తిని వెలికి తీయడంపై దృష్టి సారించే వ్యూహాన్ని రూపొందించిన ఘనత ఆయనకు ఉంది. ఈ థోరియం కేంద్రీకృత వ్యూహం ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భిన్నంగా ఉంది. ఈ వ్యూహాత్మక లక్ష్యాన్ని సాధించడానికి భాభా ప్రతిపాదించిన విధానం భారతదేశం యొక్క మూడు దశల అణు విద్యుత్ కార్యక్రమంగా మారింది. 1966 జనవరి 24 న మోంట్ బ్లాంక్ సమీపంలో ఎయిర్ ఇండియా ఫ్లైట్ 101 కూలిపోవడంతో హోమి జె. భాభా మరణించాడు.

# సొంత సామాజికవర్గం నుంచే అసంతృప్తి



తిరుపతి, అక్టోబరు 29, పాపం.. రోజా.. మంత్రి పదవి వచ్చిందన్న సంతోషం లేదు. పర్యాటక శాఖ మంత్రిగా రోజా సంతృప్తికరంగా ఉన్నారా? లేదా? అన్నది పక్కన పెడితే నియోజకవర్గంలో మాత్రం ఆమెకు నిద్రపట్టడం లేదు. ఎటు చూసినా అసమ్మతి. తన సొంత సామాజికవర్గం నుంచే ఆమెకు అసంతృప్తి ఎదురవుతుంది. మంత్రి అని కూడా నియోజకవర్గంలోని సొంత పార్టీ నేతలే లెక్క చేయడం లేదు. వైరి పక్షం కంటే రోజాకు స్వపక్షంలోనే శత్రువులు ఎక్కువగా ఉన్నారు. వారిని ఎదుర్కొనడం కష్టసాధ్యమయింది. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కంటే మంత్రిగా ఇప్పుడు రోజా బేలగా మారారునగరి నియోజకవర్గంలో రోజా రెండు సార్లు విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో వరసగా గెలిచి 2024 ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం సిద్ధమవుతున్నారు. నగరిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గాలి ముద్దు కృష్ణమ నాయుడు మరణం, ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు రోజాకు కలిసి వచ్చాయి. అంతకు ముందున్న బలంగా నగరిలో టీడీపీ లేదు. గాలి కుటుంబమే ప్రస్తుతం పార్టీ వ్యవహారాలను చూస్తుండటంతో రోజాకు ఈసారి గెలుపుపై కూడా డౌట్ లేదు. అయితే రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయిన నాటి నుంచి ఆమెకు సొంత పార్టీలో శత్రువులు పెరిగిపోయారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయిన తర్వాత కేజే కుమార్ వర్గంతో విభేదాలు తలెత్తాయి. అయినా జగన్ ఆయన సతీమణి కేజే శాంతికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. దీనికి తోడు చక్రపాణి రెడ్డితోనూ విభేదాలు వచ్చాయి. ఆయనను శ్రీశైలం ఆలయ కమిటీ ఛైర్మన్ గా ప్రభుత్వం నియమించింది. అయితే మంత్రి పదవి కోసం పెదవి బిగబట్టి కోపాన్ని దిగమింగుకుని మరీ వెయిట్ చేశారు. చివరకు ఆమె ప్రయత్నం ఫలించింది. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామిలు వీరిని వెనక ఉండి నడిపిస్తున్నారన్న అనుమానం కూడా రోజా అనుచరుల్లో ఉంది. కానీ పెద్దిరెడ్డిని కాదని వెళ్లే సాహసం చేయరు. అందుకే నియోజకవర్గంలో తన అసమ్మతిని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి కూడా గతంలో తీసుకెళ్లారు. కానీ పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు రాలేదు. రాకపోగా ఇటీవల కాలంలో మరింత ఎక్కువయింది. ఇక మంత్రిగా అయిన తర్వాత కొంత అసమ్మతి తగ్గుతుందని భావించినా సాధ్యం కావడం లేదు. అసమ్మతి వర్గం తమ పని తాము చేసుకుపోతుంది. ఇటీవల నగరి నియోజకవర్గంలోని కొప్పేడులో మంత్రిగా ఉన్న రోజాకు తెలియకుండా రైతు భరోసా కేంద్రానికి భూమి పూజ చేశారు. చేసింది శ్రీశైలం ఆలయ కమిటీ బోర్డు ఛైర్మన్ చక్రపాణిరెడ్డి. ఈ కార్యక్రమంలో ఈడిగ కార్పొరేషన్ ఛైర్మన్ కేజే శాంతి కూడా హాజరయ్యారు. దీంతో ఆమె ఇలా అయితే తాను రాజీకీయాలు చేయలేనని ఆడియో సందేశం విడుదల చేశారు. తనను నియోజకవర్గంలో బలహీనపర్చే ప్రయత్నం జరుగుతుందని ఆమె ఆవేదన చెందారు. రాష్ట్రమంతా పర్యటిస్తూ విపక్షాలకు సవాల్ విసురుతున్న రోజాకు మాత్రం సొంత నియోజకవర్గంలో సొంత పార్టీలోనే ఛాలెంజ్ లు ఎదురవుతున్నాయి. మరి దీని నుంచి రోజా ఎలా బయటపడతారో చూడాలి మరి.

# పుట్టిన రోజున శ్రీనివాసుడి సన్నిధిలో రాఘువ లారెన్స్

తిరుమల తిరుమల శ్రీవారిని సినీనటుడు రాఘవ లారెన్స్ దర్శించుకున్నారు.. శనివారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో రాఘవ లారెన్స్ స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు.. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.. దర్శనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన రాఘవ లారెన్స్ తో ఫోటోలు దిగేందుకు భక్తులు ఉత్సాహం చూపించారు.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన పుట్టిన రోజు సందర్భంగా శ్రీనివాసుడి ఆశీర్వాదం కోసం తిరుమలకు రావడం జరిగిందని, నాకు దేవుడు అన్ని ఇచ్చాడని, తాను ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పారు.. అదే విధంగా భక్తులు కోరిన కోర్కెలు అన్ని నేరవేర్చాలని స్వామి వారిని ప్రార్థించినట్లు చెప్పారు.. ఏప్రిల్ 14వ తారీఖున రుద్రన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు రాఘవ లారెన్స్ తెలియజేశారు..

# మహిళ మృతదేహం లభ్యం

పల్నాడు పల్నాడు జిల్లా, చిలకలూరిపేట పంట పొలాల్లో గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం అయింది. చిలకలూరిపేట మండలం తాతపూడి పంచాయతీ పరిధిలో నేషనల్ హైవే కి ప్రక్కన ఉన్న శ్రీ భువనేశ్వరి కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ దగ్గరలో గుర్తుతెలియని మహిళ మృతదేహం పడివుంది. తాతపూడి హైవే దగ్గర నుండి యద్దనపూడి మండలం సురవరపు గ్రామానికి వెళ్లే రోడ్డు దారి లోని మధ్య పొలంలో రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో పడి ఉన్న గుర్తుతెలియని మహిళ మృతదేహం గురించి, సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ పోలీస్ సిబ్బంది వారు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్ కు సమాచారం అందించారు, మహిళ వయసు సుమారు 33 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా. మహిళ మృతదేహానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది అన్నారు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ లు తెలియజేశారు.

# మంథని మండలంలో ఘనంగా నాగుల చవితి వేడుకలు

మంథని పవిత్ర కార్తీక మాసంలో వచ్చే నాగుల చవితి పర్వదినాన్ని శనివారం మంథని మండలంలో భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. మంథని పట్టణంలోని నాగుల సంధి వద్ద గల పుట్టలో, మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేట లో గల నాగులమ్మ దేవాలయంలో, మంథని మండలం గాజులపల్లి గ్రామంలోని సంతాన నాగేంద్ర స్వామి దేవాలయంలో శనివారం తెల్లవారుజాము నుంచే పండుగ సందడి మె?దలైంది. మహిళ భక్తులు పుట్టలో పాలు పోసేందుకు బారులు తీరారు. తలంటి స్నానం, శుభ్ర వస్త్రధారణ, పూజ సామగ్రితో వచ్చి నాగారాధన చేస్తూ భక్తులు తమ మె?క్కులను తీర్చుకున్నారు. పుట్టలో ఆవు పాలు పోసి పుట్ట వద్ద చలిమిడి, పూలు, పళ్లు వేసి పంచేలు కప్పి తమ భక్తిని చాటుకుంటున్నారు. కొంత మంది ఈ వేడుకను ఇళ్లలో జరుపుకుంటూ ఉంటే.. మరికొందరు పుట్ట వద్ద చేసుకుంటున్నారు. నాగుల చవితి రోజున నాగదేవతను ఆరాధించడం వల్ల జాతకంలో ఉన్న రాహు-కేతు దోషాలతోపాటు సర్పదోషం తొలగిపోతుంది. ఈరోజున నాగదేవతను పూజించడం వల్ల సంతానం లేని దంపతులకు పిల్లలు కలుగుతారు. పెళ్లికాని యువతీయువకులు నాగారాధన చేస్తే వివాహం అవుతుందని నమ్ముతారు. నాగేంద్రుడిని పూజిస్తే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు దాని నుండి బయటపడతారు. హిందూమతంలో దీపావళి తర్వాత వచ్చే పండుగలలో దీనికే అత్యంత ప్రాధాన్యత ఉంది.

# కుళ్లిన కోడి మాంసం విక్రయాలు

నెల్లూరు నెల్లూరులో కుళ్ళిపోయిన కోడి మాంసం విక్రయాలు మరోసారి బయటపడ్డాయి. జిల్లా వైద్యశాఖ వైద్య వైద్య శాఖ అధికారి, నగర వైద్యాధికారి జాయింట్ ఆపరేషన్లో మాంసం విక్రయాల అక్రమాలు వెలుగు చూసింది. చెన్నై నుంచి దిగుమతి అవుతున్న కోడి లివర్ వాహనాన్ని అధికారులు తనిఖీలు చేసారు. అక్రమంగా చెన్నై నుంచి దిగుమతి చేస్తున్న 300 కేజీల కోడి లివర్ మాంసం సీజ్ చేసారు. ఆరిఫ్ అనే వ్యాపారి కుళ్ళిన కోడి మాంసం దిగుమతి చేసుకున్నట్లు గుర్తించారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే ఇలాంటి మాంసం విక్రయతలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు. నగరంలో తనిఖీలు కొనసాగుతున్నాయి.

# బద్వేల్ లో గుట్కా మాఫియా

## యథేచ్ఛగా సాగుతున్న గుట్కా దందా కోట్ల రూపాయల వ్యాపారం

బద్వేలు పొగాకు గుట్కా ఉత్పత్తులపై నిషేధం ఉన్నప్పటికీ బద్వేలు నియోజకవర్గంలో ప్రతిరోజు లక్షల రూపాయల గుట్కా వ్యాపారం సాగుతుంది గుట్కా వ్యాపారులు గుట్టుగా వ్యాపారం సాగిస్తున్నారు పది రోజుల క్రితమే బద్వేలు లో పోలీసులు దాదాపు మూడు లక్షల రూపాయలు విలువచేసే గుట్కాను స్వాధీనం చేసుకోవడమే కాకుండా ఎనిమిది మందిని అరెస్టు చేశారు కర్ణాటకలోని బీదర్ కేంద్రంగా గుట్కా దిగుమతులు జరుగుతున్నాయి దిగుమతులు చేసుకున్నవారు జోరుగా అమ్మకాలు చేస్తున్నారు గుట్కా తింటే ప్రాణాంతకమని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నప్పటికీ తగిన ఫలితాలు రావడం లేదు బద్వేలులో పలు కిరాణా దుకాణాల్లో వీటి విక్రయాలు చాలా కాలంగా జరుగుతున్నాయి ఒక కిరాణా దుకాణాలు కాదు ఎక్కడపడితే అక్కడ వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి ఇది ఎవరు కూడా కాదనలేని నిజం కొందరు అక్రమ వ్యాపారులు కిరాణా దుకాణాల్లో వీటిని నిల్వ చేస్తూ హోల్ సేల్ వ్యాపారం సాగిస్తున్నారు పాన్ దుకాణాల్లో బస్టాండ్ సెంటర్లో తో పాటు బద్వేలు పట్టణంలోని పలు దుకాణాల్లో వీటి విక్రయాలు కొనసాగుతున్నాయి గప్ చీప్ గా తరలిస్తున్న సమయంలో పోలీసులకు పట్టుబడిన వీరి వ్యాపారం ఏమాత్రం ఆగడం లేదు ఎలాంటి బెరుకు లేకుండా లారీలు కార్లలో గుట్కా బస్తాలు దిగుమతి చేసుకుంటున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే యువత కార్మికులు ఎక్కువగా ఉండే చోట ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది అక్రమ గుట్కా వ్యాపారానికి కడప జిల్లాలో బద్వేల్ ప్రాంతం అడ్డాగా మారింది బద్వేల్ లో గతంలో పోలీసులు వరుసగా గుట్కా నిలువ ఉన్న బస్తాలు స్వాధీనం చేసుకున్నారు బద్వేల్ పట్టణంలో కొందరు గుట్కా వ్యాపారులు కింగులుగా మారారు వారు ఎవరిని అందరికీ తెలిసిన రహస్యమే కింగులుగా పేరు తెచ్చుకున్న మీరు మిగిలిన గుట్కా దిగుమతుల స్మగ్లర్లను తమ చెప్పు చేతుల్లో పెట్టుకొని ఆడిస్తుంటారు గుట్కా కింగ్లో ఒకడు రింగ్ లీడర్ గా వ్యవహరిస్తున్నాడు ఎక్కడినుండి గుట్కా బస్తాలు దిగుమతి చేసుకోవాలి వాటిని ఎక్కడ దాచి ఉంచాలి ఎలా సరఫరా చేయాలి అనేది ఆ లీడర్ ఆధ్వర్యంలోనే నడుస్తుంది ఇది కూడా అందరికి తెలిసిన రహస్యమే దిగుమతి చేసుకున్న సరుకులు ఎలా దుకాణాల తరపున చేయాలి ఇతర జిల్లాలకు ఎలా పంపాలి అనేది చెబుతుంటాడు పెద్దమనిషి ముసుగులో ఉన్న అతను 10 రోజులకు ఒకసారి గుట్కా వ్యాపారులతో రహస్య సమావేశాలు జరుగుతుంటాడు గత సంవత్సరం బద్వేల్ పట్టణం సురేంద్ర నగర్ చెందిన చంద్రశేఖర్ నాయుడు గుట్కా నింపిన సంచులను మరో ప్రాంతానికి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు అతని నుంచి రూ 4.50 లక్షలు విలువ చేసే 27 గుట్కా బస్తాలు స్వాధీనం చేసుకున్నారు అలాగే ఒక వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది వాహనంతో పాటు మరో బుల్లెట్ వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు పోలీసుల కళ్ళు కప్పి లక్షల రూపాయలు విలువచేసే గుట్కా బస్తాలు బద్వేల్ నుంచి ఎంతో కాలంగా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి బద్వేల్ లో నిషేధిత గుట్కా అమ్మకాలు దిగుమతులు ఎగుమతులు చేసే రాకెట్ హద్దు మీరిపోయింది కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ కేంద్రంగా ఉన్న ప్రాంతం నుంచి గుట్కా దిగుమతులు బద్వేలుకు చాలా కాలం నుంచి వస్తున్నాయి పోలీసుల నిర్బంధాన్ని సైతం పక్కనపెట్టి గుట్కా రాకెట్ చెలరేగిపోతుంది గుట్కా వ్యాపారం అంటే తెలియని వారికి కూడా వీటిని గుట్కా రాకెట్ వెంటపడి మరి అంట కడుతుంది వ్యాపారులతో కుమ్మక్కై సినీ పక్కీలో దందా సాగిస్తున్నారు దీనికి జిల్లా కేంద్రంలో ఉన్న ఇద్దరు వ్యాపారులు అన్ని విధాల సహకారం అందిస్తున్నట్లు సమాచారం గుట్కా దందా సాగిస్తున్న వారిని పోలీసులు ఎప్పటికప్పుడు పట్టుకొని అరెస్టు చేస్తున్న తగిన ఫలితాలు మాత్రం రావడం లేదు గుట్కా బస్తాలు నిల్వ ఉంచేందుకు బద్వేలు పట్టణంలో పలుచోట్ల బాడుగలకు ఇల్లు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం బద్వేల్ పట్టణంతోపాటు చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కూడా గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది పోలీస్ స్టేషన్ కు అతి సమీపంలోనే దుకాణాల్లో గుట్కా వ్యాపారం సాగుతుండడం గమనార్హం గుట్కా కింగ్లో ఒకడు పోలీసులకు కొరకరాని కొయ్యాగ తయారయ్యాడు గుట్కా వ్యాపారాలు చేసేవారికి గతంలో పోలీసు అధికారులు కౌన్సిలింగ్ పదేపదే ఇవ్వడం జరిగింది అయినప్పటికీ కొంతమంది వ్యాపారంలో ఏమాత్రం మార్పు రాకపోవడం విశేషం పోలీసు అధికారులు చేస్తున్న హెచ్చరికలు కొంతమంది గుట్కా వ్యాపారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది గత సంవత్సరం గోపవరం మండలం పి పి కుంట గ్రామ చెక్ పోస్ట్ వద్ద సుమారు 15 లక్షల రూపాయలు విలువచేసే వెయ్యి బస్తాల గుట్కా సంచులతోపాటు దాని రవాణాకు ఉపయోగించిన వాహనము ఇద్దరు తెలంగాణ వాసులను పోలీసులు పట్టుకున్నారు వీరికి బద్వేల్ లో గుట్కా దిగుమతులు చేసుకునే వారితో ఎప్పటినుంచో అవినాభా సంబంధాలు ఉన్నాయి ఇది ఇప్పటికీ హాట్ టాపిక్ గానే ఉంది

# కుమారుడి మృతి తట్టుకోలేక తల్లి మృతి

అనంతపురం కుమారుడు చనిపోయాడని సమాచారం తెలియగానే అక్కడికక్కడే కుప్పకూలి తల్లి చనిపోయిన సంఘటన అనంతపురం జిల్లా డి. హిరేహాల్ మండలం పాత అడగళి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఎలా ఉన్నాయి. డి.హిరేహాళ్ మండలం పాత అడగళి గ్రామానికి చెందిన కురుబ సోమశేఖర్( 55) గత కొద్ది రోజులుగా దీర్ఘకాలిక సమస్యతో బాధపడుతూ చివరకు కర్ణాటక ప్రాంతంలోని బళ్ళారి లోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతను మరణించడంతో మృతదేహాన్ని పాత అడగలి గ్రామంలోని ఇంటికి తరలించారు. కాగా కుటుంబ సభ్యులు బంధువులతో పాటు తల్లి కురుబ కొల్లి తిప్పమ్మ రోదిస్తూ ఒక్కసారిగా ఏడుపు ఆపేసింది. అక్కడ ఉన్న వారంతా నిర్ధాంత పోయారు ఆమె పరిస్థితిని గమనించి వెంటనే పరిశీలించగా ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. తనయుడు చనిపోయాడని బాధతో శోక సంద్రంలో ఉన్న తల్లి మానసికంగా కృంగిపోయి బాధ భరించలేక తాను కూడా శ్వాస వదిలేసింది. ఆమె మరణం గ్రామంలో అందరిని కలిచివేసింది తల్లి బిడ్డలు మరణంలో కూడా ఏకమైయ్యారని మరింత రోదనతో ఆర్తనాదాలు పెడుతూ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తనయుడు పాడి పక్కన తల్లి మృతదేహాన్ని కూడా ఒకేసారి అంతక్రియల్లో పాలుపంచుకోవడం తీరని శోకాన్ని మిగిల్చింది. గ్రామంలో తల్లి బిడ్డ మరణం తీవ్ర శోకాన్ని కలిగించింది.

# పోలీసులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కడప పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ శనివారం నగరంలోని ఉమేష్ చంద్ర స్మారక పోలీస్ కళ్యాణ మండపంలో పోలీసు, హోమ్ గార్డ్స్, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు, విశ్రాంత సిబ్బందికి ఉచిత మెగా మెడికల్ క్యాంపు ను ప్రారంభించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, ఫిజీషియన్, గైనకాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజి, లాపరోస్కోపీ, ఆప్తాల్మాలజి, వంటి విభాగాలలో అరుణాచల హాస్పిటల్స్, శ్రీశ్రీ హోలిస్టిక్, సహస్ర, అవ్వారు, పల్లా, పుష్పగిరి ఐ హాస్పిటల్, కడప హాస్పిటల్ లకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు డా.నిరంజన్ రెడ్డి, డా. శ్రావం కుమార్ రెడ్డి, డా. క్రాంతి కుమార్, డా. అవ్వారు అర్జున్, డా. ఎం.సునీల్ దత్తు, డా. బి.మహేష్, డా. పి.అభిలాష్, డా.డి.చైతన్య రెడ్డి, డా.ఆర్.మమతేశ్వరి, డా.ఆర్.శిరీష, డా. పి.ఎ తేజస్విని, డా.ఓంప్రకాష్ వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీస్ సంస్మరణ వారోత్సవాలు అక్టోబర్ 21 నుండి నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని, ఇందులో భాగంగా ఉచిత మెగా మెడికల్ క్యాంపును పోలీసు సిబ్బంది, విశ్రాంత సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కొరకు ఏర్పాటుచేయటం జరిగిందని తెలియజేశారు. పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవని, వారి డ్యూటీ సమయాలు కూడా చాలా భిన్నంగా ఉంటాయని, ఆహారం కూడా సమయానికి తీసుకోలేని పరిస్థితులు ఉంటాయని, విధి నిర్వహణలో వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబర్ 21న అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ప్రతి రోజు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని ఉమేష్ చంద్ర స్మారక కల్యాణ మండపంలో రక్త దాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్ ప్రారంభించారు.జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ రక్తదానం చేసిన సిబ్బందిని అభినందించి వారిలో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా మీడియాతో జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. పోలీసు అధికారు లు,సిబ్బంది త్యాగ గుణం, దృఢ సంకల్పంతో రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల రక్షణ కోసం అహర్నిశలు నిరంతరం విధులు నిర్వహిస్తు నిస్వార్థంగా రక్త దానం చేయడానికి ముందుకు వచ్చారని అన్నారు.రక్త దానం విషయం లో అపోహలు పడవద్దని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఇతరులకు ప్రాణ దాతలు అవుతారని ఎస్పీ గారు పేర్కొన్నారు.పై కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్.పి (అడ్మిన్) తుషార్ దూడి ఐ.పి.ఎస్, ఎ.ఆర్ డి.ఎస్.పి రమణయ్య, కడప డి.ఎస్.పి బి.వెంకట శివారెడ్డి, పోలీస్ సంక్షేమ వైద్యశాల యూనిట్ వైద్యురాలు డా. మేరీ సుజాత, డి.పి.ఓ ఎ.ఓ జ్యోతి, ఆర్.ఐ లు శ్రీనివాసులు, మహబూబ్ బాషా, జార్జ్, వీరేష్, సోమశేఖర్ నాయక్, నగరంలోని సి.ఐ లు, ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.జగన్నాథ రెడ్డి, పోలీసులు, వారి కుటుంబ సభ్యులు, డి.పి.ఓ సిబ్బంది పాల్గొన్నారు.

# దళితుల భూములను డంపు యార్డుకు కేటాయించడాన్ని విరమించుకోవాలి

దళిత కౌన్సిలర్స్ డిమాండ్

పట్టణ అభివృద్ధికి రూ: 15.34 కోట్లు మంజూరు

పాత డంపు యార్డును తొలగించాలి ..కౌన్సిలర్స్





నందికొట్కూరు . అక్టోబర్ 29 నందికొట్కూరు మున్సిపాలిటీ కి నూతనంగా ఏర్పాటు చేసే డంపు యార్డ్ కు దళితుల భూములను కేటాయించడాన్ని విరమించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి ,కౌన్సిలర్ చిన్న రాజులు మున్సిపల్ కమిషనర్ ను డిమాండ్ చేశారు.శనివారం పట్టణంలోని జై కిసాన్ పార్క్ నందు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది .ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కొరకు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ లతో రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చర్చించి పట్టణాభివృద్ధికి రూ 15.34లక్షలు మంజూరు చేయించినందుకు కౌన్సిలర్లు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .సాధారణ సమావేశంలో పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై మున్సిపల్ డి ఈ నాయబ్ రసూల్ నివేదికను చదివి కౌన్సిల్ ఆమోదం కొరకు ఉంచారు .సమావేశంలో ఏబీఎం పాలెం కు చెందిన దళిత కౌన్సిలర్లు ప్రశాంతి ,చిన్న రాజులు మాట్లాడుతూ గత 70 సంవత్సరాల క్రితం భూమి లేని రెండు వందల మంది దళిత కుటుంబాల కు చెందిన పేదలు ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్నారు .సర్వేనెంబర్ 77/ 1,113,111,70,71లలో సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారు .ప్రస్తుతం ఆ భూములలో మున్సిపాలిటీకి సంబంధించి డంపు యార్డును ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారుల ద్వారా చేపట్టిన సర్వేను నిలుపుదల చేయాలని కమిషనర్ ను కోరారు .అనంతరం సమస్యపై కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ్ ఆంధ్ర కమిషన్ ఆదేశాల మేరకు 2050జనాభా లెక్కల ను దృష్టిలో ఉంచుకొని నూతన డంపింగ్ యార్డ్ నిర్మాణం కొరకు రెవెన్యూ అధికారులకు స్థల సేకరణ కోసం జిల్లా కలెక్టర్ ను కోరడం జరిగింది .డంపింగ్ యార్డ్ నిర్మాణం కోసం 7.50ఎకరాల స్థలం రెవెన్యూ అధికారులు భూ సేకరణ సర్వే చేస్తున్నారని తెలిపారు .మున్సిపాలిటీ పరిధిలో రోజుకు 20టన్నుల చెత్త సేకరించడం జరుగుతుందని ఈ చెత్తను అధునాతన పద్ధతుల ద్వారా తడి, పొడి చెత్త ద్వారా సంపద సృష్టించేందుకు నూతన డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు .మున్సిపాలిటీ కి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వం భూములను రెవిన్యూ అధికారులు కేటాయిస్తామన్నారు . ఇందుకు కౌన్సిల్ సభ్యులు సహకరించాలన్నారు.. .అలాగే కౌన్సిలర్ చాంద్ భాష లక్ష్మీదేవి మాట్లాడుతూ పాత డంపు యార్డులో ని చెత్తను తగలబెట్టడంతో పొగ,కాలుష్యంతో కురువ పేట ,బైరెడ్డి నగర్ తదితర కాలనీలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని , రైతులు తమకలాల్లో పశువుల మేతకు గడ్డివాములు వేసుకున్నారని ఏ క్షణాన అగ్ని బారిన పడతాయో నన్న భయాందోళన చెందుతున్నారన్నారు .అనంతరం కమిషనర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు డంపు యార్డుకు 1.20 సెంట్ల స్థలం ఉండడంతో అది పూర్తిగా నిండిపోయిందని ఇతర ప్రాంతాలకు త్వరలో తరలించే ప్రయత్నం జరుగుతున్నాయని తెలిపారు .దళితుల భూములను రక్షించాలంటూ బహుజన సమాజ్ పార్టీ ,సిపిఎం ,ఎమ్మార్పీఎస్ తదితర సంఘాల నాయకులు మున్సిపల్ చైర్మన్ ,కమిషనర్ కు వినతిపత్రం అందించారు.

# ఆర్జీయమ్ ఇంజనీరింగ్ కళాశాలలో జెఎన్ టీయూ స్థాయిలో బాస్కెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు...







నంద్యాల అక్టోబర్ 29 ( అమెరికాలో ఎంతో ప్రజాదరణ కలిగిన బాస్కెట్ బాల్ క్రీడ లో మన యువత కూడా జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు.ఈ నేపథ్యంలో జె ఎన్ టియూ బాస్కెట్ బాల్ జట్టు కు క్రీడాకారుల ఎంపిక పోటీలు నంద్యాల ఆర్జీయమ్ ఇంజనీరింగ్ కళాశాల లో నిర్వహించారు.అనంతపురం జె ఎన్ టి యూ పరిధిలోని 32 కళాశాల లనుండి 62 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు.శాంతి రాం ఫార్మసీ లో జెఎన్టీయూ స్థాయిలో కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు ఈ పోటీలను యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి జోజి రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంపిక అయిన క్రీడాకారులు సౌత్ జోన్ తరపున బెంగళూరు లో జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు హాజరవుతారని అన్నారు. సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు ఈ జట్టుకు శిక్షణ ఇస్తారన్నారు.అయితే 2008 లో అనంతపురం జెఎన్ టీయూ ఆవిర్భావించినప్పటినుండి ఇప్పటి వరకు 20 క్రిడా పోటీల నిర్వహణ కు వ్యయ ప్రయాసలు కోర్చి సహకరించిన ఆర్జీయమ్ శాంతి రాం విద్యాసంస్థల చైర్మన్ డా శాంతి రాముడు కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కళాశాల డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డా అశోక్ కుమార్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలలో విద్యార్థులు చదువులో, క్రీడల్లో,ఉపాధి అవకాశాల్లో సత్తా చాటడమే తమ లక్ష్యమని అన్నారు.అందుకే కళాశాల లో అంతర్జాతీయ ప్రమాణాలతో సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు చేశామన్నారు.కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ ఎం ఎన్ వి రాజు, నెల్లూరు జిల్లా కు చెందిన బాస్కెట్ బాల్ కోచ్ శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కు చెందిన బాస్కెట్ బాల్ కోచ్ శ్రీనివాసరావు, ఇండియన్ బాస్కెట్ బాల్ ప్లేయర్ నాగ చంద్ర,,ఆకాంక్ష జూనియర్ కళాశాల బాస్కెట్ బాల్ కోచ్ నవీన్, ఆర్జీయమ్ విద్యా సంస్థల ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్, కోచ్ లు, సుబ్బరాజు, నాయక్ పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ

తిరుమల కేంద్ర మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి విచ్చేసిన కేంద్ర మంత్రి ఇరానీ ఈరోజు ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. కేంద్రమంత్రి కి ఆలయ అధికారులు మహాద్వారం దగ్గర స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం మంత్రి కి రంగనాయకుల మండపంలో వేద పండితులు చేత వేద ఆశీర్వాదం అందించారు, టిటిడి అధికారులు స్వామివారి వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పవర్ స్టార్ అభిమానులకు గుడ్ న్యూస్!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రస్తుతం నాలుగు ప్రాజెక్ట్ లని లైన్ లో పెట్టిన విషయం తెలిసిందే. రెండు రీమేక్ సినిమాలతో పాటు రెండు స్ట్రెయిట్ ప్రాజెక్ట్ లు చేస్తున్నారు. ఇందులో జాగర్లమూడి క్రిష్ డైరెక్ట్ చేస్తున్న పీరియాడికల్ మూవీ 'హరి హర వీరమల్లు' ఒకటి. పవన్ కల్యాణ్ కెరీర్ లో తొలి సారి చేస్తున్న పీరియాడిక్ ఫిక్షన్ మూవీ ఇది. గత కొంత కాలంగా నిరవధికంగా వాయిదా పడుతూ వస్తున్న ఈ మూవీ తాజా షెడ్యూల్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా?.. ఎప్పుడెప్పుడు పూర్తవుతుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై స్టార్ ప్రొడ్యూసర్ ఏ.ఎం.రత్నం సమర్పణలో ఏ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ మూవీ తాజా షెడ్యూల్ ని త్వరలోనే ప్రారంభిస్తామంటూ వర్క్ షాప్ ని కూడా చేశారు. ఇందులో పవన్ కల్యాణ్ కూడా పాల్గొనడంతో ఇక షూటింగ్ ఆగదని అంతా అనుకున్నారు. కట్ చేస్తే.. పవన్ కల్యాణ్ జనసేన ఎర్టీ కార్యకలాపాల్లో భాగంగా వైజాగ్ పర్యటనకు వెళ్లడం.. అక్కడ వైసీపీ నాయకులపై నిప్పులు చెరగడంతో ఏపీలో రాజకీయ వేడి రాజుకుంది. ఈ నేపథ్యంలో 'హరి హర వీరమల్లు' తాజా షెడ్యూల్ మొదలయ్యేది కష్టమేననే కామెంట్ లు వినిపించాయి. అయితే పవన్ కల్యాణ్ అనూహ్యంగా ఈ మూవీ షూటింగ్ ని బుధవారం రామోజీ ఫిల్మ్ సిటీలో మొదలు పెట్టినట్టుగా తెలుస్తోంది. బ్యాక్ టు బ్యాక్ అంగీకరించిన సినిమాలని పూర్తి చేసి వచ్చే ఎన్నికలకు సిద్ధం కావాలనే ఆలోచనలో వున్నారట. ఇందులో భాగంగానే వరుసగా పెండింగ్ లో వున్న సినిమాలని పూర్తి చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారట.ఇదిలా వుంటే రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా వేసిన సెట్ లలో 'హరి హర వీరమల్లు' షూటింగ్జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ఈ కీలక షెడ్యూల్ లో పవన్ తో పాటు హీరోయిన్ నిధి అగర్వాల్ ఇతర ప్రధాన తారాగణం పాల్గొంటున్నారట. వారిపై పలు కీలక సన్నివేశాలని రూపొందిస్తున్నారని తెలుస్తోంది. తాజా షెడ్యూల్ దాదాపు 20 రోజుల పాటు సాగనుందట. ఇది నిజంగా పవన్ అభిమానులకు గుడ్ న్యూసే.17వ శతాబ్దం మొఘల్ సామ్రాజ్యం కాలం నాటి పరిస్థితుల నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ అర్జున్ రాంపాల్ కీలక పాత్రల్లో నటిస్తుండగా ఎం.ఎం. కీరవాణిసంగీతం అందిస్తున్నారు.

# 'అవతార్-2' మరో సంచలనం అవుతోందన్న జేమ్స్ కామెరూన్!

జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్-2'-' ది వే ఆఫ్ వాటర్' డిసెంబర్ లో రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతోన్న విజువల్ వండర్ ఇది. దశాబ్ధ కాలంగా ప్రేక్షకాభిమానులు ఎంతో ఎగ్జైట్మెంట్ తో ఎదురుచూస్తున్నారు. ఇక ఆ సమయం రానే



వచ్చేసింది. మరో రెండు నెలల్లో సినిమా ప్రేక్షకుల ముందుకొస్తున్న నేపథ్యంలో అంచనాలకు అంతకంతకు రెట్టింపు అవుతున్నాయి.కామెరూన్ ఎలాంటి విజువల్ ట్రీట్ ని అందించబోతున్నారు? అన్న ఉత్సాహం ఉరకలేస్తుంది. ది వే ఆఫ్ వాటర్ లో ఎంతటి అద్భుత సృష్టికి తెర తీసారు? అంటూ ఒకే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో సినిమా గురించి కామెరూన్ సంచలన వ్యాఖ్యలు చేసారు. మార్వెల్..డీసీ ప్రాంచైజీ చిత్రాల్లోని పాత్రల్లో లేని పరిపక్వత నా రాబోయే అవతార్ ది వే ఆఫ్ వాటర్ పాత్రల్లో ఉంటాయి.గతంలో మార్వెల్..డిస్నీ నుంచి వచ్చిన సూపర్ హీరోల చిత్రాలపై కొన్ని రకాల విమర్శలొచ్చాయి. ఆయా సినిమాల్లో పాత్రల మధ్య సంబంధాలుంటాయి కానీ వాస్తవికంగా అనిపించవు. ఏదో వారంతా కళాశాలలో ఉన్నట్లు ప్రవర్తిస్తారని విమర్శించారు. అలా సినిమాలు తీయడం సబబు కాదు. తీసే సినిమా అర్ధవంతంగా ఉండాలి. అర్ధవంతంగా ఉంది అని తప్పుడు భావనను వీడనాడాలి.అప్పుడే మంచి సినిమాలు చేయగలం. అవతార్ సీక్వెల్ లో వర్తింగట్..జో సుల్తానా పోషించిన జాక్..నేయిత్రి పాత్రలు తమ కుటుంబాన్ని సురక్షితంగా ఉంచడానికి చాలా కష్టపడతాయని చూస్తారు. మార్వెల్..డిస్నీ ప్రాంచైజీ చిత్రాల్లో పాత్రల్లో లేని పరిపక్వతను జేక్..నేయిత్రి మధ్య చూస్తారని ' ధీమా వ్యక్తం చేసారు.ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట దుమారం రేపుతున్నాయి. కామెరూన్ తన సినిమా గొప్పతనం కోసం ఇతర చిత్రాల్ని తక్కువ చేసి మాట్లాడటం భావ్యం కాదంటూ నెటి జనులు కామెంట్లు పెడుతున్నారు. మరి వీటిపై హాలీవుడ్ దిగ్గజాలు ఎలాంటి బదులిస్తారో చూడాలి. డిస్నీ..మార్వెల్ రియాక్షన్ ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# మారుతికి ప్రభాస్ ఫ్యాన్స్ భయం పట్టుకుందా?

పాన్ ఇండియా వైడ్ గా భారీ క్రేజ్ ని సొంతం చేసుకున్న ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ క్రేజీ సినిమాలతో అభిమానులకు ట్రీట్ ఇవ్వబోతున్నాడు. 'రాథేశ్యామ్'తో తీవ్ర నిరాశకు గురైన అభిమానులకు ఆది పురుష్ సలార్ లతో డబుల్ ట్రీట్ ఇబ్బదానికి రెడీ అవుతున్నాడు. ప్రభాస్ నటిస్తున్న తొలి



మైథలాజికల్ డ్రామా 'ఆది పురుష్' వచ్చే ఏడాది జనవరి 12న భారీ స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా ఐదు భాషల్లో రిలీజ్ కాబోతున్న విషయం తెలిసిందే. 3డీఐమ్యాక్స్ ఫార్మాట్ లలోనూ ఈ మూవీ విడుదల కాబోతోంది.ఇక 'కేజీఎఫ్' సిరీస్ సినిమాలతో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ 'సలార్' మూవీ చేస్తున్నాడు. హోంబలే ఫిలింస్ బ్యానర్ పై విజయ్ కిరగందూర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మూవీ ప్రస్తుతం చిత్రీకరణ దశలో వుంది. హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ మూవీని వచ్చే ఏడాది అంటే 2023 సెప్టెంబర్ 28న భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు.ఈ రెండు భారీ ప్రాజెక్ట్ లతో పాటు ప్రభాస్ 'ప్రాజెక్ట్ కె'ఓనూ నటిస్తున్నాడు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ దశలో వుంది. మూడు సినిమాలు రిలీజ్ కి రెడీ అవుతున్న నేపథ్యంలో ప్రభాస్ అనూహ్యంగా మారుతితో హారర్ థ్రిల్లర్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఫ్యాన్స్ ఎంతగా వారిస్తూ వద్దని చెబుతున్నా సరే ఎక్కడా తగ్గేదే లే అన్నట్టుగా మారుతి ప్రాజెక్ట్ కోసం ముందుకు సాగుతున్నాడు. ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తూ మధ్య మధ్యలో మారుతి సినిమాకు డేట్స్ కేటాయిస్తూ సినిమాని పూర్తి చేయాలని ప్రభాస్ ప్లాన్ చేసుకున్నాడట.ఆ ప్లాన్ ప్రకారమే మారుతి ప్రాజెక్ట్ ని సైలెంట్ గా పట్టాలెక్కించేశాడు. ఇటీవల ప్రత్యేకంగా ప్రభాస్ పై లుక్ టెస్ట్ తో పాటు ట్రయల్ షూట్ ని పూర్తి చేసిన మారుతి ఇప్పుడు ఏకంగా షూటింగ్ నే మొదలు పెట్టేశాడని తెలుస్తోంది. ప్రతీ సినిమా విషయాన్ని మీడియా ముఖంగా ఫ్యాన్స్ కు తెలియజేసే ప్రభాస్ ఈ సినిమా విషయంలో ఎందుకు సైలెంట్ ని మెయింటైన్ చేస్తూ వుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభాస్ ఫ్యాన్స్ కారణంగానే మారుతి ఈ మూవీని సైలెంట్ గా కానిచ్చేస్తున్నాడనే కామెంట్ లు వినిపిస్తున్నాయి.ఫ్లాపుల్లో వున్న మారుతితో ప్రభాస్ సినిమా చేయడం ఫ్యాన్స్ కు పెద్దగా ఇష్టం లేదు. అయినా సరే ప్రభాస్ మాత్రం ఎక్కడా తగ్గకుండా ఫ్యాన్స్ మాట వినకుండా ఈ మూవీని సైలెంట్ గా కానిచ్చేస్తుప్పాడు. మారుతి కూడా ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదిగా కూడా వెల్లడించకపోవడానికి కారణం ప్రభాస్ ఫ్యాన్స్ అని వారి భయం పట్టుకోవడం వల్లే మారుతి సైలెంట్ గా సినిమాని పట్టాలెక్కించాడనే కామెంట్ లు వినిపిస్తున్నాయి.

# కోహ్లిని ప్రశంసలతో ముంచెత్తిన బీసీసీఐ కొత్త బాస్



ఆ మ్యాచ్ తాలూకా స్మృతులు క్రికెట్ అభిమానులను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. భారత అభిమానులైతే ఈ మ్యాచ్ జ్ఞాపకాలను చిరకాలం గుర్తుపెట్టుకుంటారు. అంతలా ఆ మ్యాచ్ ప్రభావం ఇండియన్ క్రికెట్ ఫ్యాన్స్‌పై చూపింది. అందరు క్రికెట్ అభిమానుల్లాగే ఈ మ్యాచ్ భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నూతన అధ్యక్షుడు రోజర్ బిన్నీని కూడా అమితంగా ఆకట్టుకుంది.ఈ మ్యాచ్‌లో కోహ్లి వీరోచిత ఇన్నింగ్స్‌కు బీసీసీఐ బాస్ ముగ్దుడైపోయాడు. విరాట్ కొట్టుడు ఓ కలలా అనిపించిందని ప్రశంసలతో ముంచెత్తాడు. దాయాదుల సమరం క్రికెట్ ప్రపంచానికి అసలుసిసలైన టీ20 క్రికెట్ మజాను అందించిందని అన్నాడు. ముఖ్యంగా కోహ్లి ఇన్నింగ్స్ న భూతో న భవిష్యత్ అన్న రీతిలో సాగిందని కొనియాడాడు.కోహ్లి ఆడిన ఇన్నింగ్స్ అసాధారణమైనదని అభివర్ణించాడు. ఒత్తిడి సమయాల్లో కోహ్లి మరింత మెరుగ్గా ఆడతాడని ఈ ఇన్నింగ్స్ ద్వారా మరోసారి నిరూపితమైందని కితాబునిచ్చాడు. క్రికెట్‌లో కోహ్లి నిరూపించుకోవాల్సింది ఇంక ఏమీ లేదని, అతని ఈ ఇన్నింగ్స్ ఒక్కటి చాలు అతనేంటో ప్రపంచానికి తెలియడానికంటూ ఆకాశానికెత్తాడు. ఛేదనలో కోహ్లినే రారాజని ఈ ఇన్నింగ్స్ మరోసారి క్రికెట్ సమాజానికి చాటాచెప్పిందని ప్రశంసించాడు.కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ (కేసీఏ) ఏర్పటు చేసిన సన్మాన సభలో బిన్నీ ఈ మేరకు కోహ్లిని, పాక్‌పై భారత్ సాధించిన విజయాన్ని కొనియాడాడు. ఈ సందర్భంగా బిన్నీ తన సొంత రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌పై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. తాను బీసీసీఐ అధ్యక్షుడు కావడానికి తోడ్పడిన కేసీఏకి కృతజ్ఞతలు తెలిపాడు. కేసీఏకు తాను జీవితకాలం రుణపడి ఉంటానిని అన్నాడు. కేసీఏతో తన అనుబంధం 50 ఏళ్ల నాటిదని గుర్తు చేశాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190